
# మనలో ఒకరు

కేశిరాజు ఫణిప్రసాద్



ఆదివారం ఉదయం ఎనిమిది గంటలు... డ్రాయింగ్ రూంలో కూర్చొని పేపరు చదువుతున్నాను! పేపరు చూస్తున్నానన్న మాటేకానీ మనసంతా కాఫీ కోసం ఎదురు చూస్తోంది! ఉదయం లేవగానే ఎటువంటి ఆలస్యం చేయకుండా మా ఆవిడ వసుధ కాఫీ ఇచ్చేస్తుంది.! ఈ రోజు ఆదివారం! స్నానం చేసే లోపే ఒకటి రెండు సార్లు కాఫీ తాగితే కానీ ఆగలేని మనసు రెండో సారీ కాఫీ కోసం విలవిల్లాడుతోంది.




వంటింట్లో హడావుడిగా ఉందేమో అనుకుంటూ వసుధా అంటూ పిలిచాను! ''ఒక్క క్షణం, కాఫీ తీసుకొని నేనే వస్తున్నాను'' అంటూ మా ఆవిడ వెంటనే పలికింది! పైగా ఆప్యాయంగా పలికింది! ఏమిటో విశేషం

మాట ప్రకారం క్షణంలో కాఫీ తెచ్చి ఇచ్చింది.! తను కూడా ఒక గ్లాసులో కాఫీ తెచ్చుకుంది.! తప్పకుండా ఏదో పని మీదే వచ్చింది.! కాఫీ తాగుతూ అనుకున్నాను.!

''ఈ మధ్య కాఫీ మంచి రుచిగా ఉంటోందోయ్'' కాఫీ కప్పుని వసుధకి ఇచ్చేసి మళ్లీ పేపరు చేతిలోకి తీసుకొన్నాను! వంటింట్లోకెళ్లిన మా ఆవిడ క్షణంలోనే నా దగ్గరకొచ్చింది! నా చేతిలోని పేపర్‌ను తీసుకొని జాగ్రత్తగా మడత పెట్టి పక్కన పెట్టింది!

విషయం ఏమిటోనని నేను అడగలేదు. ఏదో ముఖ్యమైన పని ఉండే ఉంటుందని వసుధని చూసి అర్ధం చేసుకున్నాను!

''దశరథరామయ్యగారి పరిస్థితి రోజు రోజుకీ అధ్వాన్నమైపోతోంది'' తను చెప్పబోయే సంగతికి మొదటి మాట! ''దశరథ రామయ్యగారంటే జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను! అదే ఆ వేళాకోళమే నాకు నచ్చదు'' సీరియస్‌గా చెప్పింది మా ఆవిడ! ''మన వీధి చివర పాలబూత్ దశరథ రామయ్యగారి గురించేగా నువ్వు మాట్లాడేది'' అని అడగగానే వసుధ అవునన్నట్టుగా తలూపింది!

దశరథరామయ్య రిటైరయిన వ్యక్తి! ఉద్యోగంలో ఉన్నన్నాళ్లు కుటుంబం కోసం ఎంతో కష్టపడ్డాడు! తన వాళ్ల సుఖసంతోషాల కోసం బాధ్యతల లైనులో అనుక్షణం నిలబడి తన బాధ్యతలను విరామం లేకుండా నిర్వహించిన ఓ సగటు మనిషి! రిటైరయ్యాక తన కొచ్చే పెన్షన్ డబ్బులు కూడా కొడుకు బాగోగుల కోసం ఇచ్చేసిన పిచ్చి తండ్రి! ఎవరికైనా డబ్బు అపురూపం గానీ, డబ్బు తెచ్చే మనిషిని అభిమానంగా చూడాలని అనుకునే కొడుకులు ఈ రోజుల్లో ఉంటారా? ఉంటే తప్పు కదా!

రిటైరయ్యాక కొడుకు దగ్గరే ఉండి అలసిన మనసుకు విశ్రాంతినివ్వాలని అందరి తండ్రుల్లాగే ఆశపడ్డారు!

ఆసరాగా ఉంటాడనుకున్న కన్న కొడుకు ఆశ్రయం కూడా ఇవ్వలేదు. పైగా ఒక రోజు చెప్పకుండా ఉంటున్న ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు! ఎక్కడికో వెళ్లి తిరిగివచ్చిన దశరథరామయ్య తాలుకూ పాత సామాను మాత్రం ఖాళీ చేసిన ఇంట్లో కనపడింది! తన కన్నకొడుకు దృష్టిలో తనూ కూడా ఒక పాత సామాను అనే విషయం అర్ధం అయి నిస్సహాయంగా చతికిలబడిపోయాడా వృద్ధుడు!

ఈ పరిస్థితి వసుధ నాతో చెప్పింది! నాకున్న పలుకుబడితో ఆయన పేరుమీద మా వీధి చివరలో ఒక పాల బూత్ ఏర్పాటు చేయించాను!

దశరథరామయ్య రెక్కల కష్టంతో మళ్లీ నిలదొక్కుకున్నాడు! మళ్లీ ఏమైందో?

''దశరథరామయ్య కొచ్చిన కష్టం గురించి ఆలోచిస్తున్నారా?'' అన్న మా అర్ధాంగి మాటకు అవునని తలూపి. పాల బూత్ వల్ల అంతో ఇంతో సంపాదించుకుంటూ సుఖంగా ఉన్నాడని అనుకుంటున్నానే! నేను ఆలోచిస్తున్న సంగతి వివరించాను!

''కానీ అలా సుఖపడే అదృష్టం లేదాయనకు!'' వసుధ మాటల్లో మళ్లీ ఆయనకేదో కష్టం వచ్చిందన్న ఉద్దేశం!

''ఎప్పుడో చెప్పా పెట్టకుండా వెళ్లిపోయిన ఆయన కొడుకువచ్చి తనతో రమ్మని అందరం కలిసుందామని ఈ మధ్య ఆయన్ని నిలవనివ్వడం లేదు'' ఆయన కొడుకుని అసహ్యించుకుంటూ మాట్లాడుతోంది వసుధ!

మా ఆవిడ మాటలు అర్ధం కావడంలేదు! పైగా అయోమయంగానూ ఉన్నాయి!

''చూడు వసుధా, కన్నతండ్రి ఈ వృద్ధాప్యంలో కష్టపడడం చూడలేక కొడుకు ఆయనను రమ్మంటున్నాడేమో! అది ఆయనకొచ్చిన కష్టమని అనుకుంటే మనం పొరపాటుపడినట్టే! నామనసులోని మాట చెప్పాను!

''భలేవారండీ! మీలాగే మొదట్లో నేనూ అనుకొన్నాను! ఆయన్ని తనతో కలసి ఉండమని అడగడం, తండ్రిని కూర్చోపెట్టి పోషించడానికి కాదు!

వసుధ మాటలు విని ఆశ్చర్యంగా చూశాను! దశరథరామయ్యగారు మళ్లీ కాస్తోకూస్తో సంపాదిస్తున్నాడుగా! ఆ సంపాదనతో తనంటున్నచోటులోనే పాలబూత్ పెట్టమని ఒకటే పోరు! ఈ పోరు పడలేక పోతున్నానని, తనకి మాట సహాయం చేయ్యమని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు దశరథ రామయ్య!

''ఈ పరిస్థితిని ఇంతవరకూ ఎందుకు రానిచ్చాడు దశరథరామయ్య! ఇక్కడే ఉండి తన బ్రతుకు తాను చూసుకుంటానని కొడుక్కు చెప్పేస్తే సరిపోతుందిగా! ఇందులో మరొకరి ప్రమేయం అవసరం లేదనే ఉద్దేశంతో మాట్లాడాను!

నా మాటలు వసుధకు నచ్చలేదు! అందుకే నా వైపు ఒకసారి చురుకుగా చూసింది!

''వసుధ... ఇది దశరథరామయ్య వ్యక్తిగత విషయం. కుటుంబ సమస్యల్లో తల దూరిస్తే పరాయి వాళ్లుగా మనం అభాసుపాలవుతాం! ఆయన పాలు పోస్తున్నాడు మనం డబ్బులిస్తున్నాం! సంబంధం అంత

వరకే ఉంచుకోవడం సమంజసం''

ఎవరి సంసారాలు వాళ్లవి ఎవరి సమస్యలు వాళ్లు పరిష్కరించుకోవాలి. సహజంగా ఇది నా స్వభావం!

''దశరథరామయ్యగారు ముసలాయన. పైగా ఒంటరివాడు! ఆయనకు మరొకరి అండ లేదని తెలిసి ఆ కొడుకు ఆయనను భయపెడుతున్నాడు! ఆమాటా ఈ మాటా చెప్పి ఆయనను బెదిరిస్తున్నాడు! ఇవన్నీ తెలిశాకనే ఎవరో ఒకరు కలగజేసుకుంటే తప్ప తగువు తీరదు! ఆ ఎవరో ఒకరు మీరూ నేను ఎందుకు కాకూడదు? వృద్ధాప్యంలో ఉన్న తండ్రులంతా కొడుకుల చేత పీడింపబడాల్సిందేనా? ఎన్నాళ్లు ఇలా కొడుకుల వల్ల తండ్రులు నరకయాతన పడాలి? వసుధ భగ్గుమంటోంది

ఒక్కసారి ఆలోచించాను! 'మనిషిని మరో మనిషి ఆదుకోవాలి.' ప్రోత్సహిస్తున్న వివేకం!

సాయంత్రం ఆరు గంటలు! ఆఫీసు నుంచి వస్తూ కూరలు కొనడం పూర్తి చేశాను! కూరల మార్కెట్‌కి ఇల్లు నడిచి వెళ్లే దూరంలో ఉంది! కాలినడకనే ఇంటికి బయలుదేరాను!

అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాను! మా ఇంటికి వెళ్లే దారిలో రామాలయం ఉంది! గుడి ద్వారానికి అటూ ఇటూ అరుగుల మీద కొందరు ముసలి వాళ్లు కూర్చుని కాలక్షేపం కోసం కబుర్లు చెప్పుకొంటున్నారు!

అలవాటు ప్రకారం గుడి ముందు నిలబడి కళ్లు మూసుకొని ''జై శ్రీరామ్'' అనుకొని మనసులోనే నమస్కరించాను!

''మాస్టారు టైమెంతయింది'' అన్న మాట వినపడింది! అటు వైపు చూశాను! గుడి అరుగుమీద కూర్చున వాళ్లలో ఒక ముసలాయన పక్కనే ఉన్నాయన్ని అడుగుతున్నాడు! '' ఆరున్నరకి మరో అయిదు నిమిషాలు ఉందండి'' జవాబు చెప్పిన పెద్దాయన మాటల్లో నిస్పృహ! ఎందుకో?

అనుకోకుండా ఏరోజు లేనిది ఆ గుడి అరుగు మీద కాసేపు కూర్చోవాలని అనిపించి కూర్చున్నాను! నాకు తెలియకుండానే అక్కడ కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నవాళ్లని గమనిస్తున్నాను!

అక్కడ కూర్చున్న వాళ్లందరూ రకరకాలన ఉద్యోగాలు చేసి రిటైరయినవాళ్లు! అందరూ ఒకే వయసు వాళ్లవడంతో ఒకరితో ఒకరు మనసులు విప్పి మాట్లాడుకుంటున్నారు!

వాళ్ల మాటలు వినాలనిపించింది! నాలో అనుకోని ఆసక్తి! ''రావుగారూ ఇవ్వాళ టైమెంతయిందని పదే పదే అడుగుతున్నారు ఎందుకని, ఎక్కడికయినా ప్రయాణమా?'' అని ఒకాయన ప్రశ్న!

''భలేవారండి! ఈ వయసులో ప్రయాణం చేసే ఓపిక ఎక్కడుంటుంది! ఎంత త్వరగా ఏడుగంటలవుతుందా? అనుకుంటున్నాను! టైము కాస్తా అయితే మెల్లగా ఇంటికి చేరుకొని నాలుగు మెతుకులు తినాలనే ఆరాటం. మా కొడుకు, కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులే! వాళ్లు ఇంటికి చేరాక వంటవుతుంది! ఎప్పుడో పొద్దున్న తిన్న భోజనమే, మధ్యాహ్నం కాఫీ తాగాలంటే కుదరదు! అందుకే ఈ ఎదురుచూపులు!''

ఈ మాటలు విన్నాక ఆయన వైపు పరిశీలనగా చూశాను! హృదయం జాలితో నిండిపోతుంటే కళ్లు చెమ్మగిల్లాయి!

''ఎవరికైనా వృద్ధాప్యం తప్పదు! కానీ అయిన వాళ్ల ఆలనాపాలనాకి దూరమై బ్రతకడం తప్పదా?'' ఈ ఆలోచనతో నా గుండెల్లో ఆయన పడుతున్న బాధకు మాటలు రావేమో?

అక్కడున్న వాళ్లందరిని మరోసారి చూశాను! అందరూ మరొకరి ఆదరణ వల్ల బ్రతుకుతున్నవాళ్లే! ఉద్యోగం ఉన్నన్నాళ్లు వీళ్లని ఇంట్లో అందరూ ఎంతో అభిమానిస్తారు. గౌరవంతో వీరు చెప్పిన మాట ఇంటిల్లపాది వింటారు! మరి ఆ తరువాత సమాధానం దొరకని ప్రశ్న!

ఈ సమాజంలో వీళ్లు పనికిరానివాళ్లా? ఇలా అనుకుంటున్న క్షణంలో అనుకోకుండా దశరథరామయ్యగారు గుర్తుకొచ్చారు!

వసుధ మాటలు మెదులుతున్నాయి, తట్టుకోలేని స్థితిలో మనసు! ఆలోచనలు, ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి. మనసును మరో వైపు మళ్లించే ప్రయత్నం చేస్తూ ఇంటికి చేరుకున్నాను!

వసుధ ఎవరితోనో మాట్లాడుతోంది! ఎవరో వచ్చారనుకుంటూ లోపలకి అడుగు పెట్టాను! దశరథరామయ్య కూర్చొన్నాడు! నన్ను చూడగానే గౌరవంతో లేచి నిలబడ్డాడు!

''నమస్తే, నమస్తే! కూర్చోండి'' అని కూరల సంచి లోపల పెట్టి బట్టలు మార్చుకొని డ్రాయింగ్ రూంలోకి వచ్చాను!'' బాబాయిగారూ, ఇదే విషయం తెలుసుకొని మీ మనసు పాడుచేసుకోకండి! పరిస్థితులు చక్కబడడానికి మనందరం కలసి కూర్చొని ఆలోచిద్దాం'' వసుధ మాటల్లో స్పష్టమవుతున్న నమ్మకం నాలో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటే ఆయనలో ఆశని ప్రేరేపిస్తోంది! కాసేపటికి దశరథరామయ్య వెళ్లిపోయాడు!

వెంటనే ''కాఫీ పట్టుకొస్తాను'' అని వంటింట్లోకి వెళ్లిపోయింది! ''పాపం ఇప్పుడిపుడే స్థిమితంగా బ్రతుకుతున్న దశరథరామయ్యకు అంతలోనే ఊహించని స్థితి'' లోపలి నుంచి కాఫీ తెచ్చి నాకిస్తూ మా ఇంటికొచ్చి ఆయన చెప్పిన సంగతులన్నీ వివరంగా చెప్పింది వసుధ!

వసుధ మాటలు పూర్తిగా విన్నాను!





## టివిల్లో గుర్తింపు

సినిమా కుటుంబానికి చెందిన నటి దీపాంశిక. ఆమె తాత మూకీ చిత్రాల్లో పనిచేశారు. తండ్రి డైరెక్టర్. తల్లి నటి. కానీ దీపాంశికకే నటనంటే ఏమాత్రం ఇష్టం లేదు. తల్లి వొత్తిడిపై నటించడం ప్రారంభించింది. చివరికి అది విడదీయలేని బంధమైంది. 25 సినిమాల్లో నటించినప్పటికీ ఆమెకి పెద్దగా పేరు రాలేదు. టివిల్లో యాక్ట్ చేసేసరికి గుర్తింపు లభించింది. 'కిట్టీపార్టీ', 'సన్‌పరి' సీరియల్స్ ఆమెకి పెద్ద పేరు తెచ్చాయి. దీపాంశికకి ఇద్దరు పిల్లలు. ఆమె పిల్లల్ని ఎంతగా ప్రేమిస్తుందంటే ఒక సీరియల్‌లో విలన్ పాత్రని వదిలేసుకుంది. ఆ క్యారెక్టర్ పిల్లల్ని ద్వేషించేదిగా వుండటమే దీనికి కారణం.

కాసేపు ఆగి ''నాకో సందేహం దశరథరామయ్యకి కొడుకు దగ్గర ఉండడం ఇష్టంలేకపోవడానికి కారణం? ఇలా ఎందుకు అడుగుతున్నానంటే తల్లిదండ్రుల ఉనికినే భరించేలేని కొడుకులున్నారు'' అంటూ ఇంటికొచ్చేటప్పుడు దేవాలయం దగ్గర నేను చూసిన సన్నివేశాలు వివరంగా చెప్పాను!

నేను చెప్పిన దాన్ని ఎంతో శ్రద్ధగా వింది! '' మీరంటున్నది నిజమే! కానీ ఈయన సమస్య పూర్తిగా వేరు! స్వయంగా కన్నకొడుకు వచ్చి పిలుస్తున్నాడు. కానీ అందుకు ఈయన ఒప్పుకోవడం లేదంటే గతంలో జరిగిన అనుభవాలు దశరథరామయ్య హృదయాన్ని ముక్కలు చేశాయి! పైగా ఇదివరకు ఈ కొడుకే ఎన్నో విధాలుగా దూషించాడు'' దశరథరామయ్య మనోవ్యథ వసుధ మాటల్లో వ్యక్తమవుతోంది.!

''అంతా బాగానే ఉంది! ఈ రోజు మనం విన్నది ఇదివరకు మనకి తెలిసింది ఒక్క దశరథరామయ్య ద్వారానే! ఆయన కొడుకుతో మాట్లాడడం కూడా ఎంతో అవసరం! అప్పుడు మనం పరిస్థితిని చక్కదిద్దితే బాగుంటుంది!''

నా మాటలకు వసుధ ''అవును తండ్రి, కొడుకులిద్దరిని కూర్చొపెట్టి మనతో పాటు దశరథరామయ్య గురించి తెలిసిన వాళ్లను కూడా పిలవడం సమంజసం'' వసుధ ఆలోచనల్లో సమయస్ఫూర్తి! అంతేకాదు సాధారణంగా మరొకరి కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చదు! తప్పని పరిస్థితుల్లో కల్పించుకుంటే దానిని పరిష్కరించేవరకూ ఒదిలిపెట్టదు! మా అర్ధాంగి మనస్తత్వానికి నాలో స్ఫురించిన విశ్లేషణ!

''మనం వెలుగులో ఉన్నామని మురిసిపోతూ కూర్చోవడం కంటే, చీకట్లో ఉన్న వాళ్లకి మనం మన వెలుగును పంచి ఇవ్వడంలో మానవత్వం ఉంది'' ఎప్పుడో ఎక్కడో చదివిన వాక్యం అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చింది.!

''సందర్భం వచ్చినప్పుడు ఇది ఆచరణలో పెట్టాలి'' అభినందిస్తోంది అంతరాత్మ! ''ఇప్పుడే వచ్చేస్తా'' గేటు తీసుకొని వెళ్లింది వసుధ. ఎక్కడికో?

తెల్లవారురఝామున టైము నాలుగు గంటలు!

వసుధ పాలు తీసుకురావడానికి బయలుదేరుతోంది! మేమిద్దరం కలిసి క్రితం రాత్రి అనుకున్న మాట జ్ఞాపకమొచ్చింది!

అక్కడికి పాలకోసం మా వీధిలో వాళ్లే కాకుండా చుట్టుపక్కల ఉండే వాళ్లు కూడా లచ్చారు! మనసు, మాట మంచిదయినప్పుడు అందరూ వెతుక్కుంటూ మరీ వస్తారు! దశరథరామయ్యలోని మంచితనానికి ఉదాహరణగా అక్కడున్న వారిని చూస్తూ అనుకున్నాను!

పాలు పొయ్యడం పూర్తయింది! వచ్చినవాళ్లు ఆ మాట ఈ మాట మాట్లాడుకుంటూ అక్కడే ఉన్నారు!

ఇంతలో స్కూటర్ మీద ఒకతను వచ్చాడు! అందరి దృష్టి అతనిపై మళ్లింది! పాల డబ్బాలన్నీ లోపల పెట్టి బయటకొచ్చాడు దశరథరామయ్య! స్కూటర్‌మీద వచ్చిన అతడిని చూడగానే పక్కకెళ్లి నిలబడింది మా ఆవిడ!

'' ఇతను దశరథరామయ్యగారి అబ్బాయి! పేరు రామకృష్ణ'' వసుధ మాటలు వినగానే అక్కడున్న వాళ్లందరూ అతనినే చూశారు! పైగా అందరి చూపుల్లోనూ ఆశ్చర్యం, అనుమానం! కారణం ఇంత ఎదిగిన కొడుకు దశరథరామయ్యకున్నాడని మాలో చాలా మందికి తెలియదు!

''చూడు బాబూ ఇవ్వాళ నువ్వు ఎందుకొచ్చావో నీ అంతట నువ్వే చెపితే బావుంటుంది'' రామకృష్ణ ఉలిక్కిపడేలా చేసింది వసుధ మాట తీరు''!

''ఈ వయస్సులో మా నాన్నగారు కష్టపడుతుంటే భరించలేకపోతున్నాను! నేనే కాదు ఏ కొడుకయినా అలాగే అనుకుంటాడు! ఆయన్ని నాతో పాటు తీసుకెళతాను. ఇలా అడుగుతున్నందుకు మరోలా అనుకోవద్దు...'' అనగానే అతన్ని మధ్యలోనే అడ్డుకొని ''మాకు తెలిసి దశరథరామయ్యగారు ఒక ఏడాదిగా ఇక్కడే ఉంటున్నారు. మరి ఇంతకాల నీవెక్కడున్నావు? ఏమైపోయావు?'' అతని గురించి పూర్తిగా తెలిసిన నేను కల్పించుకొన్నాను! నా మాటకు అనుకూలంగా మిగతా వాళ్లందరూ జవాబు కోసం అతని చూపు చూస్తున్నారు!

ఏదో చెప్పాలనుకున్నా మాటలు రానివాడిలో ఉండిపోయాడు. ''చూడబ్బాయి నీ మనసు పూర్తిగా

అర్థం చేసుకున్నాం! నువ్వు చెప్పే మాటలు కూడా ఇక్కడవాళ్లు అర్థంచేసుకుంటారు.'' మా అందరి మధ్యలో ఉన్న ఒక పెద్దాయన విషయాన్ని రెట్టించాడు!

''మీకు తెలియని విషయం కాదు! కుటుంబం అన్నాక తగవులు ఉండకుండా ఉండవు. మా నాన్న గారికి, మాకు అభిప్రాయభేదాలొచ్చాయి! అందు వల్ల... మాటలు వెతుక్కుంటున్నాడని వింటున్న ప్రతి ఒక్కరికి తెలిసిపోయింది!

''ఏమండీ దశరథరామయ్యగారు, ఏదో మాటా మాటా అనుకున్నంతమాత్రాన మీరు ఈ వయసులో విడిగా ఉండడం...'' కావాలనే ఆవిధంగా అడిగింది మా ఆవిడ!

వెంటనే కొడుకు మొహం విప్పారింది! తండ్రి మొహం చిన్నబోయింది! ''జరిగిందేదో జరిగింది! స్వయంగా వచ్చి అడుగుతున్న మీ అబ్బాయితో వెళ్లండి పెద్దమనసుతో గతం మరిచిపోండి'' ఒక మామ్మగారి సలహా!

దశరథరామయ్యగారు అనూహ్యమైన ఇరకాటంలో పడిపోయారు!

''నాదొక చిన్నమాట! ఇంతవరకూ ఆ అబ్బాయి మాటలు విన్నాం! కానీ దశరథరామయ్యగారి మనసు కూడా తెలుసుకోవాలిగా''! సమయస్ఫూర్తిగా మాట్లాడింది వసుధ!

దశరథరామయ్య ఏం మాట్లాడుతాడో? అందరి లోనూ ఒకటే భావం!

ఒక్క క్షణం! అది మామూలు క్షణం కాదు! ఎన్నో ఏళ్లు ఒక తండ్రి తన గుండెల్లో దాచుకున్న వ్యక్తిగత జీవిత అనుభవాలు గుప్పెట్లోంచి విడిపోయి ఆయన మనసును మెలితిప్పుతుంటే ఆ క్షోభ తానే చెప్పవలసిన క్షణం

మెల్లగా తలెత్తి చూశారు దశరథరామయ్య! అతి ప్రయత్నం మీద గతాన్ని తవ్వుకుంటున్న మనసు కళ్లల్లో నీళ్లుగా తిరుగుతోంది!

ఆయన పెదాలు మెల్లిగా కదులుతున్నాయి!

''అది నా కొడుకు చిన్నతనం! ఆఫీసుకు కబురొచ్చింది! స్కూల్లో ఆడుతుంటే కాలికి దెబ్బతగిలింది! అంతే నా ఒంట్లో రక్తం నీరయిపోతుంటే స్కూలుకి పరిగెట్టుకొని వెళ్లాను! తగిలిన దెబ్బ చూసుకుంటూ బాధగా ఏడుస్తున్నాడు. గట్టి దెబ్బతగిలిందని డాక్టరు కట్టుకట్టాడు! ఏమాత్రం కదిలినా నొప్పితో విలవిల్లాడిపోయేవాడు! మళ్లీ వాడు మామూలుగా నడిచేవరకూ నా భుజాల మీద కూర్చోపెట్టుకొని స్కూల్‌కి తీసుకెళ్లి తీసుకొచ్చాను! వాడు చదువులో వెనుకపబడకూడదు అది నా పట్టుదల!

ఆయన మాటలు వింటూంటే మా అందరిలో ఆసక్తి!

ఒకరోజు ఉదయం ఆఫీసుకి వెళ్లబోతుంటే ఎదురొచ్చాడు మా అబ్బాయి! ఎంతో మంచి శకునమనుకున్నాను.

''నాన్న ఇవ్వాళ అమ్మ పుట్టినరోజు, రాత్రి అమ్మ చెప్పింది'' నా మతి మరుపుకి నాలుక కరుచుకుంటూ వంటింటి వైపు చూశాను! తలుపు చాటున నుంచొని తొంగి చూస్తోంది! మా అబ్బాయి మాటల్లో ధ్వనిస్తున్న అర్ధాంగి మనసు! ఎంతో సంతోషించాను! సాయంత్రం కొత్త బట్టలు కొనుక్కని ఇంటికి వచ్చాను! బట్టల పెట్టె లాక్కున్నాడు వాడు. '' ఇదేంటి నాన్న చొక్కాలాగు అమ్మెలా వేసుకుంటుంది? అని అడిగిన వాడిని ప్రేమగా చూస్తూ ''అది నీకోసం నాని, ఇదిగో మీ అమ్మకి చీర అంటూ చేతుల వెనుక దాచిన మరో పేకెట్ చూపించాను!

తల్లీకొడుకులిద్దరూ కొత్తబట్టల్లో కళకళలాడుతున్నారు! ఆనాడు వాళ్లిద్దరిలో ఆనందం నా హృదయాన్ని మురిపించింది! ఎందుకంటే పుట్టినరోజు నాది అనే భావన!

దశరథరామయ్యని చూస్తూ ఆయన చెపుతున్నది వింటున్నాం! ఒక ఇల్లాలికి మంచి భర్త, ఒక కొడుకుకి చక్కటి తండ్రి, ఆయనలో కనిపిస్తున్నాడు!

ఎండాకాలం మొదలవుతున్న రోజులు. మా అబ్బాయికి ఏడాది పరీక్షలు దగ్గరకొస్తున్నాయి! ఆఫీసులో పగలంతా పనిచేసినా రాత్రులు వాడ్ని దగ్గర కూర్చొపెట్టుకొని శ్రద్ధగా చదివించేవాడిని! అప్పుడు గమనించాను. మా వాడిలో మంచి గ్రహింపు జ్ఞానం ఉందని! మరింత బాధ్యతగా వాడి జ్ఞానానికి పదునుపెట్టాను! పరీక్షలు మొదలయ్యాయి! ఆఫీసుకి సెలవుపెట్టాను! ప్రతిరోజూ వాడిని స్కూలుకి తీసుకెళ్లి పరీక్ష వ్రాయడం పూర్తయ్యేవరకూ స్కూలు గేటు దగ్గర కూర్చుంటూ కొబ్బరి బొండాలు కొట్టించి పెట్టేవాడిని! పరీక్షలు వ్రాస్తున్నప్పుడు మధ్యలో దాహంతో బాధపడకుండా వాచ్‌మెన్ ద్వారా కొబ్బరి నీళ్లు లోపలికి పంపిస్తూండేవాడిని! ఎండ తగలకుండా గొడుగు పట్టి స్కూల్‌కి తీసుకెళ్లాను! నేను ఊహించినదాని కంటే ఎక్కువ మార్కులతో పరీక్షలు పాసయ్యాడు! తండ్రిగా నాకు అంతకంటే మించిన ఉత్సాహం మరొకటి లేదనుకున్నాను!

ఒకప్పటి జ్ఞాపకాలు చెపుతున్న దశరథరామయ్య మొహం గతం తాలుకూ ఉత్సాహంతోపూవులా కనిపిస్తోంది! మాలో ఎవ్వరికీ అక్కడి నుంచి కదలాలని అనిపించడంలేదు!

''ఉద్యోగరీత్యా నేనే ఏదో ఒక ఊరు వెళ్లాల్సి వచ్చేది! నేను లేనప్పుడు డబ్బుకి ఇబ్బందిపడకుండా మా ఆవిడ పేరు కూడా కలిపి జాయింట్ ఎకౌంట్ ఏర్పాటు చేశాను!

ఇవన్నీ నేను మీకు చెప్పడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది!

''జీవితం ఒక ఆశయం! నేను సాగించాల్సిన ఆశయం. కట్టుకున్న ఇల్లాలిని, కన్నకొడుకుని సుఖ పెట్టాలి! సంతోషంతో వాళ్లకి జీవితం ప్రతిరోజూ ఒక పండగలా గడపాలి''!


దశరథరామయ్యకు జీవితం మీద ఎంత అవగాహన! అభినందించకతప్పదు!


బాల్యం ఎంతో అమూల్యం! వాత్సల్యంతో దశరథరామయ్య కొడుకుకి అందించిన బాల్యం మరింత అమూల్యం! తండ్రీకొడుకుల వైపు ముచ్చటగా చూశాను!

అనుకోకుండా నాలో ఉలికిపాటు! ఎందుకు! గతానికి ప్రస్తుతానికి పొంతన లేదు?

''ఎవరు ఎవర్ని అపార్థం చేసుకున్నారు? అనుకుంటూ వాళ్లనే చూస్తున్నాను! దశరథరామయ్య చెపుతున్న విషయం మీద ఆసక్తి రెట్టింపు అయింది!

''ఒకరోజు ఉదయం స్నానం చేయడానికి వెళుతున్నాను! ''మావయ్యగారు మీరు కాసేపయ్యాక స్నానం చేద్దురుగాని, ఆయన కోసం వేడి






నీళ్లు తోడిపెట్టాను'' అక్కడే నిలబడిపోయాను! మాకోడలు అలా మాట్లాడడం.... ఊహించని పరిస్థితి. ఇంతలో మావాడు స్నానం చెయ్యడానికి నీళ్ల గదిలోకి వెళ్లడం!

''అబ్బాయి ఆఫీసు ప్రతిరోజూ ఎనిమిది గంటలకేనట.... వంటింట్లోంచి మా శ్రీమతి మాటలు! అప్పుడు గుర్తుకు వచ్చింది నేను రిటైరయ్యానని!

''ఆఫీసుకు లేటుగా వెళ్లి నా కొడుకు మాట పడితే నాకూ బాధేగా'' సర్ది చెప్పుకొన్నాను!

ఉదయం పూజ పూర్తయింది! హాల్లోకి వచ్చి కూర్చొన్నాను! పేపరు చదువుతూ కాఫీ త్రాగడం అలవాటు. న్యూస్ పేపరు కోసం అటూ ఇటూ చూశాను! కనపడలేదు! కాఫీ కోసం ఎదురుచూస్తున్నాను! ''అన్నపూర్ణ, కాఫీ ఇస్తావా?'' వంటింట్లోకి చూస్తూ మా ఆవిడని పిలిచాను! ''కాఫీ కలిపి ఉంచాను! చెయ్యి ఖాళీ లేదు, లోపలకి రండి కాఫీ త్రాగుదురుకానీ'' మా ఆవిడ లోపల్నించే చెప్పింది! తప్పని సరిగా వెళ్లి కాఫీ తెచ్చుకొన్నాను! కాసేపటికి మా వాడు ఆఫీసుకి బయల్దేరాడు! చేతిలో ఆరోజు పేపరు తనతో పట్టుకొని పోయాడు!

మనసులో వెలితి! ఎందుకో అర్థం కావడం లేదు!

మా ఇంట్లో అన్నింటిలోనూ నేను వెనకపడిపోతున్నానని తెలుసుకోలేని స్తితి!

నా దైనందిన జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి! అదీ నాకు తెలియకుండా!

ఆరోజు శనివారం! ''సాయంత్రం మీరు బ్యాంక్‌కి వెళ్లి డబ్బు తీసుకురండి! ఆఫీసు ధ్యాసలో డబ్బు తీసుకురావడం మరిచిపోకండి'' కోడలు మా అబ్బాయికి చెక్కు రాసిస్తూ చెప్పింది.

'అవునురా అలాగే నాకు కూడా డబ్బు పట్టుకురా' అంటూ నేను కూడా మా వాడికి చెక్కు సంతకం పెట్టి ఇచ్చాను! 'ఈ మధ్య ఒంట్లో నలతగా ఉంటోంది ఇవ్వాళ ఎలాగైనా డాక్టరుకి చూపించుకోవాలి' ఆఫీసుకెళుతున్న మా వాడిని చూస్తూ అనుకొన్నాను!

సాయంకాలం రావలసిన వాడు రాత్రి పొద్దుపోయాక వచ్చాడు! సరాసరి ఇంట్లోకి వెళ్లిపోయాడు. ''ఇదిగో డబ్బు తెచ్చాను లోపలపెట్టు'' పెళ్లానికి ఇచ్చాడు! ఏరా అబ్బాయి నా డబ్బు కూడా ఇస్తే.... అంటున్న నన్ను ''ఏదో హడావుడిలో మీరిచ్చిన చెక్కు ఆఫీసులో మర్చిపోయాను నాన్నా!'' కాళ్లు చేతులు కడుక్కోవడానికి లోపలికి వెళ్లిపోయాడు.

మర్నాడు ఆదివారం! బ్యాంక్‌కి సెలవు! నెలాఖరు రోజులు, చేతులో డబ్బు లేదు. మా సుపుత్రుడి నిర్లక్ష్యవైఖరికి చిన్నబోయిన నేను అయోమయ స్థితిలో పడిపోయాను!

''మీ డబ్బు, నా డబ్బు అనుకోవడం ఏమిటి నాన్న, ఇంట్లో డబ్బుందిగా ఎంతకావాలో తీసుకోండి'' అని మావాడు అంటాడని అనుకున్నాను! ఆ ఊసే ఎత్తకుండా తనగదిలో కూర్చొని వారపత్రిక చూస్తున్నాడు!

ఒరే నీవరస నాకేం నచ్చడం లేదు ఎందుకు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నావు, పైగా నా మనసు బాధపడుతున్నా పట్టించుకోవేరా? అని వాడిని నిలదీద్దామనుకున్నాను.

''ఒద్దు తొందరపడకు! కొడుకుతో గొడవపడితే అది నీకే చిన్నతనం'' వివేకం హెచ్చరించడంతో నన్ను నేను నిగ్రహించుకున్నాను!

ఆ రాత్రి నాలో రకరకాల ఆలోచనలు! ఎన్నో అనుమానాలు! నాపట్ల ఇంట్లో వాళ్లు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? నా వాళ్లయ్యుండి నేనంటే ఎందుకింత చిన్నచూపు?

''నేనే నా వాళ్లని అర్థం చేసుకోలేకపోతున్నానేమో'' మరో పక్క ఆత్మవిమర్శ!

అనుక్షణం ఏదో ఒక సంఘర్షణ! దశరథరామయ్య మాటలు వింటున్న మాకే ఇంత బాధ కలుగుతుంటే అనుభవించిన మనిషిగా ఆయన పరిస్థితి? ఊహించలేని స్థితి అది!

''తప్పు నాదే! నేనే వాళ్లని అర్థం చేసుకోలేకపోతున్నాను! ఇక నుంచి వాళ్లని సరిగ్గా అర్థం చేసుకోవాలి! అవునూ! మీ నాన్నగారిచ్చిన చెక్కుని నిజంగానే ఆఫీసులో మరిచిపోయారా? '' కోడలు నా కొడుకుని అడుగుతోంది! అవును కావాలనే ఆఫీసులో ఒదిలేశాను! ఇవాళ ఈ పని, రేపు మరొకటి, మానాన్న చెప్పిన ప్రతిపనీ చేసుకుంటూ, నా బ్రతుకంతా ఆయనకి ఊడిగం చెయ్యాల్సిందే! అపురూపంగా పెంచుకున్న నా కొడుకు నేనంటే ఉన్న అభిమానం! అవమానానికి బాధపడుతున్న మనసు! ''నా మనసు పూర్తిగా తెలుసుకొని ప్రవర్తిస్తున్నాడు'' కోడలి మనసులో తృప్తి!'' ఇలా బ్రతకవలసిన మనిషినా నేను?''

నా గతం గుర్తుకొచ్చి నాలో కలిగిన ప్రశ్న!

''అనవసరం! నీకంటూ ఓ గుర్తింపు తెచ్చుకో '' వ్యక్తిత్వం కర్తవ్యాన్ని సూచించింది! తెల్లవారింది! ఈ రోజు నుంచి నేను కోరుకున్నట్టుగా జరగాలి'' నాలో పట్టుదల! ఇంట్లో ఉంటున్న మా ఆవిడిని, నా కొడుకుని, కోడలిని పిలిచాను! ఇన్నాళ్లు నేను అణుచుకొంటున్న బాధను వివరించాను! ఈ ఇంట్లో అందరి నుంచి నేను కోరుకుంటున్నది ఏమిటో అర్థమయ్యేలా మాట్లాడాను! ఒకే చోట ఉంటున్న మన మధ్య పరాయితనమెందుకని నిలదీశాను! నేను కూడా మీలో ఒకడినన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించాను!''

చెప్పడం పూర్తి చేసిన దశరథరామయ్య వైపు చూస్తున్నాం! ఏం చెప్పాలి?

''చూడండి, ఇంతవరకూ నేను చెప్పిన విషయాలు కొత్తవి కావు! కానీ ఒక ముఖ్యమైన విషయం నేను చెప్పాలి! నా కుటుంబం నా కెంత అన్యాయం చేసిందో తెలుసుగా! అందుకు కారణం నా పెంపకంలో లోపం! ప్రేమతో పెంచాను! చదువు చెప్పించాను! కానీ మనిషికి మనిషికి మధ్య ఉండే బంధాలు ఎంత విలువైనవో నేర్పలేదు! మానవ సంబంధాల గొప్పతనం గురించి చెప్పలేదు! ఈ విషయంలో నేను అసమర్థుడిని!

దశరథరామయ్య కళ్లల్లో నీరు సుడులు తిరుగుతున్నాయి!

కాలం మారుతోంది! కనిపెంచిన వాళ్ల స్థితిలో మార్పురాలేదు! చిన్నతనంలో తండ్రి వద్ద ఆత్మీయత కోరుకున్న పిల్లలు వృద్ధాప్యంలో తమకన్న వాళ్ల ఆస్తికావాలనుకుంటున్నారు ఎందుకు? అసలు ముసలితనం అంటే ఈ తరం వారికి ఎందుకింత చులకన? వయసు మళ్లిన వాళ్లు మనలో ఒకరనే ఎందుకుండదనిపిస్తోంది?

ఇంకొక మాట! జన్మనిచ్చిన అసహ్యించుకోవడం, వార్ధక్యంలో నరకయాతనలు పెట్టటం ఘోరం కాదా! మనుషులుగా చూడకుండా మానసికంగా హింసించి జీవితాన్ని క్రుంగదీసే కొడుకులు నేరస్తులు కారా? ఈ తరం వీళ్ల అమానుష ప్రవర్తన సాంఘిక దురాచారం కాదా? అసలిలా అనుకొంటున్న వాళ్లెవరైనా ఉన్నారా?

దశరథరామయ్య ప్రశ్నకు జవాబు ఉందా?

★